క్లుప్తంగా

ఘనంగా భూలోకమాంబ విగ్రహ ప్రతిష్ట



బుచ్చెయ్యపేట: మండలంలోని మల్లాం భూపతి పాలెం(ఎంబీ పాలెం)లో గ్రామ దేవత భూలోకమాంబ విగ్రహ ప్రతిష్ట మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. గ్రామస్తులంతా కలిసి పొలిమేరలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ప్రతిష్ఠించారు. ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. చిడతలు, తప్పెటగుళ్ల పోటీలు పలువురిని ఆకట్టుకున్నాయి. చిన మల్లాం, పెద మల్లాం, చిన భీమవరం, పెద భీమవరం, అప్పంపాలెం, శివరాంపురం తదితర గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో తరలవచ్చి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్నారు.

సత్వరమే అర్జీల పరిష్కారం



కొండపాలెంలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ నాగమ్మ

రోలుగుంట: రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలకు సత్వరమే పరిష్కారం చూపుతామని తహసీల్దార్ ఎస్.నాగమ్మ అన్నారు. కొండపాలెం సచివాలయం వద్ద శుక్రవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. భూసమస్యలపై రైతుల నుంచి 18 వినతులు స్వీకరించగా.. ఆర్ఐ రామమూర్తి నమోదు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రీసర్వే లో లోపాల సవరణకు ఈ సదస్సులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో చెల్లాయ్యమ్మ, సర్వేయర్ గిరిజ, రైతులు పాల్గొన్నారు.

గురుస్వాములకు సత్కారం



గురుస్వాములను సత్కరిస్తున్న నాగేశ్వరరావు

బుచ్చెయ్యపేట: మండలంలో 108 రోజుల పాటు దీక్ష చేసిన అయ్యప్ప గురుస్వాములతో పాటు ఇతర గురుస్వాములను ఆకుల ఫౌండేషన్ అధినేత ఆకుల నాగేశ్వరరావు శుక్రవారం ఘనంగా సత్కరించారు. గ్రామాల్లో మాలధారణలతో దైవభక్తి పెరుగుతోందని నాగేశ్వరరావు చెప్పారు.

అందుబాటులో మినుము విత్తనాలు

రోలుగుంట: మండలం వ్యవసాయ కార్యాలయంలో రైతులకు పంపిణీ చేసేందుకు వీబీఎన్-8 రకం మినుము విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఎస్.విజయలక్ష్మి తెలిపారు. శనివారం నుంచి విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. కావాల్సిన రైతుల తమ వివరాలు నమోదు చేయించుకొని, నగదు చెల్లించి విత్తనాలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రేవతమ్మ

గొలుగొండ: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ సూచించారు. కృష్ణదేవిపేట జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. టెక్నాలజీని వాడుకొని సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. అపరిచిత వ్యక్తులు మన వ్యక్తిగత వివరాలు అడినప్పుడు చెప్పొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తారకేశ్వర్రావు, ప్రిన్సిపాల్ గంగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

నీటి నిల్వలు ఎప్పటికప్పుడు తొలగించాలి

కె.కోటపాడు: ఇంటి పరిసరాల్లో నిలిచిపోయిన మురుగునీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని చౌడువాడ పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు సూచించారు. పైడంపేట గ్రామంలో శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి వద్ద రుబ్బు రోళ్లు, పాత టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు ఉంటే దోమలకు ఆవాసులుగా మారుతాయన్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే-డ్రైడే కార్యక్రమం చేపట్టాలన్నారు. ఎంఎల్‌హెచ్‌పీ సంతోషి, ఏఎన్‌ఎం సత్యవేణి, ఆశా కార్యకర్తలు ధనలక్ష్మి, సూర్యకాంతం పాల్గొన్నారు.




ఎ.కోడూరు శివాలయంలో అభిషేక పూజలో పాల్గొన్న శివ భక్తులు



వామలింగేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు చేస్తున్న మహిళలు



ముద్దుర్తి సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద మూడు నదులు కలిసే చోట స్నానమాచరిస్తున్న భక్తులు



చోడవరం స్వయంభూ గౌరీశ్వరస్వామి ఆలయం వద్ద కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

హరహర మహాదేవ..!

- భక్తులతో శైవ క్షేత్రాలు కిటకిట
- మార్మోగిన శివ నామస్మరణ
- భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు



తిమిరాం శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



జంపెన గుప్తలింగేశ్వరాలయంలో కార్తీక దీపారాధనలో పాల్గొన్న భక్తులు



నందీశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు



వడ్డాది శివాలయంలో జ్వాలాతోరణం



కె.జె.పురం జంక్షన్‌లోని ఉజ్జయిని మహాకాళేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



బ్రహ్మలింగేశ్వరస్వామి సన్నిధిలో అభిషేకాలు చేస్తున్న భక్తులు

చోడవరం: హరహర మహాదేవ శంభో శంకర అంటూ శైవ క్షేత్రాలు శుక్రవారం హోరెత్తిపోయాయి. కార్తీక పౌర్ణమి పవిత్ర పూజలు, ఉపవాసాలతో భక్తులు మహాశివుని నామస్మరణతో తరించారు. చోడవరం స్వయంభూ గౌరీశ్వరాలయం భక్తులతో కళకళలాడింది. తెల్లవారుజాము నుంచి భక్తులు వచ్చి ఇక్కడి కోనేరులో స్నానాలు ఆచరించి పవిత్ర కార్తీక దీపారాధన చేశారు. స్వయంభూగౌరీశ్వరస్వామిని దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. స్వామికి క్షీరాభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శారదా, పెద్దేరు, బొడ్డేరు నదుల కలిసే సంగమంలో భక్తులు పౌర్ణమి స్నానాలు చేసి, ఇక్కడ కొలువైన ముద్దుర్తి సంగమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. గవరవరంలో కొలువైన మూడు నందుల శివాలయం, జుత్తాడలో కొలువైన స్ఫటిక లింగంకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వెంకన్నపాలెం కాశీవిశ్వేశ్వర స్వామి, సాయిబాబా ఆలయ సమాహార ప్రాంగణంలో అర్చనలు జరిపారు. లక్కవరం, గోవాడ, రాయపురాజుపేట గ్రామాల్లో ఉన్న శివాలయాలు కూడా భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. అన్ని ఆలయాల్లో జ్వాలాతోరణం చేశారు. పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చిన భక్తులతో నదీ పరివాహక ప్రాంతాల్లో రేవులన్నీ కళకళలాడారు. ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య ఆది దేవుడైన చోడవరం స్వయంభూ విఘ్నేశ్వర స్వామి ఆలయం కూడా భక్తులతో కళకళలాడింది.

బుచ్చెయ్యపేట: మండలంలో కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజాము నుంచి బుచ్చెయ్యపేట, వడ్డాది, విజయరామరాజుపేట, పెదమదీన, దిబ్బిడి, గున్నెంపూడి, బంగారుమెట్ట, పీడీ పాలెం, గంటికొర్లాం, తురకలపూడి, సీతయ్యపేట తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి పలు గ్రామాల్లో జోలాతోరణం నిర్వహించారు. పలువురు మహిళలు ఉపవాసాలు అనంతరం సాయంత్రం పుణ్య నదుల్లో స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించారు.

మాకవరపాలెం: మండలంలోని పెద్దమిల్లు జంక్షన్‌లోని వామలింగేశ్వర, పి.పి.అగ్రహారంలోని అమృతేశ్వర, గిడుతూరులోని గంగాధరేశ్వరస్వామి ఆలయాల్లో పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వయంభూ వామలింగేశ్వర ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసాలు ఉండి, అనంతరం శివాలయాల్లో పూజలు చేశారు.

నర్సీపట్నం: బలిఘట్టం ఉత్తర వాహిని పాకలపాడు గురుదేవుల ఆశ్రమంలో పౌర్ణమి పూజలు ఘనంగా నిర్వహించారు. పూజల్లో పాల్గొనేందుకు నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పూజలు అనంతరం గురుదేవులను భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. సమీపంలోని బ్రహ్మలింగేశ్వరస్వామిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. మహిళలు ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాడుగుల: మండలంలో జంపెన గుప్తలింగేశ్వర, మాడుగులలోని శ్రీకృష్ణ భూపాలేశ్వర స్వామి, ఉమా భీమ లింగేశ్వరాలయం, విజేపురంలోని ముఖలింగేశ్వరాలయాల్లో కార్తీక పౌర్ణమి సందర్భంగా దీపారాధన నిర్వహించారు. పెద్దేరు నదిలో ఉత్తరాయణం స్నానాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అరటి దవ్వలో దీపాలు వెలిగించి నదిలో విడిచిపెట్టారు.

దేవరాపల్లి: మండలంలోని దేవరాపల్లి, తిమిరాం, బోయిలకింతాడ, వేచలం, ఎం.అలమండ, పెదనందిపల్లి, చిననందిపల్లి గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. స్వామిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

కె.కోటపాడు : ఎ.కోడూరు భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో శివ భక్తులు ప్రత్యేక అభిషేక పూజలు చేశారు.దాలివలస గ్రామస్తులు కార్తీక పౌర్ణమి సందర్భంగా రామాలయంలో సీతా రాములకు ప్రత్యేక పూజలు చేశారు.

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురం శివాలయంతో పాటు వీరవల్లి అగ్రహారం, జంపెన, పిట్టగెడ్డ, వీరనారాయణం, దబ్బుకుంట రహదారిలోని పార్వతీ సమేత భీమేశ్వరుని ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి జ్వాలా తోరణం నిర్వహించారు. స్వామిని తిరువీధుల్లో ఊరేగించారు. కె.జె.పురం జంక్షన్‌లోని ఉజ్జయిని మహాకాళేశ్వర ఆలయంలో శివునికి అభిషేకాలు చేశారు.



శివుడి ఆకారంలో ప్రమిదల వెలుగులు

వైభవంగా లక్ష దీపారాధన



భక్తులతో కిటకిటలాడిన కాశీ విశ్వేశ్వర మృత్యుంజయ ఆలయం

రోలుగుంట: మండల కేంద్రం రోలుగుంట కోనేరు చెంతన కొండ దిగువనున్న శ్రీకాశీ విశ్వేశ్వర మృత్యుంజయ ఆలయం వద్ద శుక్రవారం లక్ష దీపారాధన కార్యక్రమం వైభవంగా జరిగింది. ముందుగా స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. కార్తీక పౌర్ణమి కావడంతో సాయంత్రం మహిళలు విష్ణువు, శివయ్యకు ప్రత్యేక పూజలు చేశారు. శివలింగం, స్వస్తిక్, త్రిశూలం, శివుడు, తదితర ఆకృతుల్లో దీపాలు వెలిగించారు. ఆలయ ప్రచార కార్యదర్శి పిల్లి శ్రీను, కమిటీ సభ్యులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

సారా తయారీ, విక్రయం చట్టరీత్యా నేరం



సారా తయారీకి దూరంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ సీఐ పాపునాయుడు

కె.కోటపాడు : నాటుసారా తయారీ, విక్రయం, రవాణాకు పాల్పడడం చట్టరీత్యా నేరమని చోడవరం ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.పాపునాయుడు హెచ్చరించారు. కొరువాడ గ్రామంలో శుక్రవారం ఆపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా నాటుసారా తయారీతో ఎదురయ్యే సమస్యలను ఆయన ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నాటుసారా తాగిన వ్యక్తులు తీవ్ర అనారోగ్యానికి గురయ్యే పరిస్థితి ఉంటుందన్నారు. నాటుసారా తయారీకి పాల్పడే వారికి 8 ఏళ్ల పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉందన్నారు. నాటుసారా తయారీ కాకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో జీవనం సాగించాలని చోడవరం ఎక్సైజ్ ఎస్ఐ శేఖరం సూచించారు. గ్రామంలో నాటుసారా తయారు చేస్తున్న 25 మందిని గుర్తించి తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశామన్నారు. అనంతరం సారా తయారీకి పాల్పడబోమని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సింగంపల్లి నారాయణమూర్తి, ఎంపీటీసీ చీపురపల్లి అచ్చిబాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బిర్సా ముండాకు ఘన నివాళి



తాటిపర్తి సచివాలయంలో బిర్సాముండా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సర్పంచ్ గౌరీదేవి

మాడుగుల రూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సాముండా జయంతి కార్యక్రమం తాటిపర్తి సచివాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గ్రామ సర్పంచ్ అల్లంగి వెంకట గౌరీదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు. శంకరంలో జరిగిన గ్రామ సభలో గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కరుణాకర్, సర్పంచ్ శోలం రమేశ్, పంచాయతీ కార్యదర్శి నౌడు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: గిరిజన ప్రాంతాల సంక్షేమ అభివృద్ధికి భవవాన్ బిర్సా ముండా అందించిన సేవలు స్ఫూర్తిదాయకమని దేవరాపల్లి ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు అన్నారు. ఈ మేరకు బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని జన జాతీయ గౌరవ దివస్ కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ దొమ్మంగి బోడెమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముందుగా బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాదకద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మెలగాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సమావేశంలో తామరబ్బ సర్పంచ్ టోకురి రామకృష్ణ, ఎంపీటీసీ బండి గౌరమ్మ, వెలుగు ఏపీఎం ఎస్.ప్రభాకర్, స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ వి.పి.వి.త్రినాథ్, హౌసింగ్ సూపర్‌వైజర్ గోవింద, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పి.రాజా పాల్గొన్నారు.

నర్సీపట్నం: భగవాన్ బిర్సా ముండా జయంతిని నర్సీపట్నం గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంఈవో సిహెచ్.తలుపులు, సంఘం సెక్రటరీ ఎస్.ధర్మరాజు, డి.దేముళ్లు, జి.పంతుల బాబు, ఎం.లింగమూర్తి, పి.లక్ష్మణరావు, నారాయణరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసీల హక్కులు, స్వేచ్ఛ, భూమి భుక్తి కోసం బిర్సాముండా అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు.

రెండు పశువుల పాకల దగ్ధం



మంటలను ఆర్పుతున్న మాడుగుల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది

మాడుగుల రూరల్: మండలంలో దబ్బుకుంట రహదారి సమీపంలో రెండు పశువుల పాకలు ప్రమాదవశాత్తు శుక్రవారం దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన యల్లపు పెంటయ్య, కస్నం నాయుడు, బలరామస్వామికి చెందిన పశువుల పాకలు కాలి బూడిదయ్యాయి. పాకల బయట దాణా ఉడకబెట్టిన అనంతరం పొయ్యి ఆర్పివేసి, రైతులు ఇంటికి వెళ్లిపోయారు. ఈ క్రమంలో పొయ్యి నుంచి నిప్పురవ్వలు ఎగిరి పాకల మీద పడడంతో మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ధాన్యం బస్తాలు, ఎరువుల బస్తాలు, వ్యవసాయ పరికరాలు, మంచాలు కాలిపోయాయి. మాడుగుల అగ్నిమాపక కేంద్రం అధికారి వి.రాజేశ్వరావు ఆధ్వర్యంలో సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే పాకలు పూర్తిగా కాలిపోయాయి. సంఘటన స్థలాన్ని ఎంపీటీసీ సభ్యుడు భీశెట్టి శ్రీనివాసరావు పరిశీలించి, బాధిత రైతులను పరామర్శించారు.

పుస్తక పఠనం ఎంతో మేలు



బుచ్చెయ్యపేట గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



చౌడువాడలో పుస్తక ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు, గ్రంథాలయాధికారి పద్మావతి



నర్సీపట్నం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన తిలకిస్తున్న విద్యార్థులు, అధ్యాపకుడు చిన్నారావు



గొలుగొండ గ్రంథాలయంలో డిబేట్‌లో పాల్గొన్న విద్యార్థులు

బుచ్చెయ్యపేట: విద్యార్థులు చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని బుచ్చెయ్యపేట లైబ్రేరియన్ వి.కృష్ణారావు తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన కల్పించారు. విద్యార్థుల్లో పోటీ తత్వం ఉండాలని, గూగుల్ సెర్చ్ పై కాకుండా పుస్తక పఠనం చేసికుంటే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తారని ఆయన సూచించారు.

కె.కోటపాడు : విద్యార్థులు తప్పనిసరిగా పుస్తక, పత్రికా పఠనాన్ని అలవర్చుకోవడం మంచిదని చౌడువాడ శాఖా గ్రంథాలయాధికారి ఎం.పద్మావతి అన్నారు. చౌడువాడ శాఖా గ్రంథాలయంలో పుస్తక, పత్రికల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి రోజూ గ్రంథాలయంలోని పుస్తకాలను చదివి మేధాసంపత్తిని మెరుగుపర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు, రిటైర్డ్ గ్రంథాలయ అటెండర్ కె.రమణమ్మ పాల్గొన్నారు.

నర్సీపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనను లైబ్రేరియన్ దమయంతితో కలిసి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు జి.చిన్నారావు ప్రారంభించారు. ఈ ప్రదర్శనను తిలకించడానికి విచ్చేసిన విద్యార్థులకు పుస్తకాల ఆవశ్యకత గురించి చిన్నారావు వివరించారు.

మాకవరపాలెం: పుస్తక పఠనంతో ఎంతో విజ్ఞానం పెంపొందుతుందని గ్రంథాలయ అధికారి చంద్రకళ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం పుస్తక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొని, పుస్తకాలను చదివారు. అనంతరం సభ్యత్వ సేకరణతో పాటు విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈ నెల 20న బహుమతులు అందజేస్తామన్నారు.

గొలుగొండ: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గొలుగొండ గ్రంథాలయంలో డిబేట్ కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి రాజుబాబు ఆధ్వర్యంలో గ్రంథాలయాల వల్ల కలిగే ప్రయోజనాలు అనే అంశంపై నిర్వహించిన డిబేట్‌లో స్థానిక కేజీబీవీ, ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు.

విద్యతోనే గిరిజన అభ్యున్నతి సాధ్యం



పాఠశాలలో మొక్క నాటుతున్న జిల్లా గిరిజన శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగ శిరీష

నాతవరం: గిరిజనులు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలంటే విద్యతోనే సాధ్యపడుతుందని జిల్లా గిరిజన శాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగశిరీష అన్నారు. మండలంలో రామన్నపాలెం గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పలు ప్రశ్నలు అడిగారు. సమస్యలపై ఏకాంతంగా మాట్లాడి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పదార్థాలను రుచి చూశారు. ముందుగా బిర్సా ముండా చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, సర్పంచ్ గంగరాజు, ఎంఈవోలు సత్యనారాయణ, కామిరెడ్డి వరహాలబాబు, ఉపాధ్యాయులు, వార్డెన్ పాల్గొన్నారు.

వేతన బకాయిలను వెంటనే మంజూరు చేయాలి

కె.కోటపాడు : మండలంలో పలు పంచాయతీలలో పని చేస్తున్న సిబ్బందికి 10 నెలలుగా ఉన్న వేతన బకాయిలను వెంటనే మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు కె.కోటపాడు ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ అప్పలరాజుకు శుక్రవారం పంచాయతీ సిబ్బంది, సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. అనంతరం ముత్యాలనాయుడు మాట్లాడుతూ సిబ్బందికి కనీస వేతనం నెలకు రూ.10 వేలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సూర్యనారాయణ, నాగరాజు, ముసిలి, దేముడు, నాయినిబాబు పాల్గొన్నారు.

అర్జీలకు 15 రోజుల్లో పరిష్కారం

కె.కోటపాడు : రీసర్వే గ్రామ సభల్లో అందుకుంటున్న అర్జీలకు 15 రోజుల్లో పరిష్కారం చూపనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ డి.రమేష్, మండల సర్వేయర్ రామచంద్రమూర్తి తెలిపారు. పైడంపేటలో శుక్రవారం రీసర్వే గ్రామసభ నిర్వహించారు. 11 అర్జీలు అందాయి. అర్జీదారులకు ముందస్తు సమాచారంతో పాటు రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సమస్యలకు పరిష్కారం చూపనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రొంగలి రాఘవనాయుడు, మహేష్, వీఆర్వో రూపాదేవి, విలేజ్ సర్వేయర్ ఐ.జగదీష్ పాల్గొన్నారు.

అనుకూరు రెవెన్యూ సభలో 29 దరఖాస్తులు

మాడుగుల రూరల్: మండలంలో అవురువాడ పంచాయతీ శివారు అనుకూరు రెవెన్యూ పరిధిలో శుక్రవారం రీసర్వే గ్రామ సభ నిర్వహించారు. స్థానిక రీసర్వే డీటీ గణపతిరావు మాట్లాడుతూ ఈ సభలో 29 దరఖాస్తులను రైతులు అందజేశారు. మండల సర్వేయరు, వీఆర్వో, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

18న కోటి దీపారాధన

మాడుగుల: స్థానిక పాండవుల కొండపై వెలసిన అతిపురాతన పార్థసారథి స్వామి ఆలయంలో ఈ నెల 18న కోటి దీపారాధన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ప్రధానార్చకుడు పార్థసారదాచార్యులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సాయంత్రం నెయ్యితో అతి పెద్ద ద్వీపారాధన జరుగుతుందన్నారు. ఆలయ ప్రాంగణంలో శుక్రవారం తుప్పల తొలగింపు చర్యలు చేపట్టారు.

గిరిజనులకు ప్రాధాన్యత ఎక్కడ?



మాట్లాడుతున్న దుంపా వరప్రసాద్

నాతవరం: ఏజెన్సీలో లేటరైట్ తవ్వకాలకు ఇచ్చే ప్రాధాన్యత.. గిరిజనుల అభివృద్ధికి ఏ ప్రభుత్వాలు ఇవ్వడం లేదని గిరిజన సంఘం నేత దుంపా వర ప్రసాద్ ఆరోపించారు. సరుగుడు గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. లేటరైట్ తవ్వకం ద్వారా పంచాయతీలకు రావలసిన ఆదాయం రాకుండా పోతోందన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూసమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగశిరీష, ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో ఉషాశ్రీ పాల్గొన్నారు.